సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



ఏడడుగులు వేయకుండానే..

ఏడడుగులు.. మూడు ముళ్లతో ఒక్కటవ్వాల్సిన బంధం వారిది.. నిండు నూరేళ్లూ కలసి జీవించాల్సిన ఆ జంట కాళ్లకు పెళ్లి పారాణి వేయక ముందే అనంత లోకాలకు వెళ్లిపోయింది. 8లో



ఆరుగురికి కోవిడ్

కాకినాడ క్రైం: జిల్లాలో మంగళవారం ఆరుగురికి కోవిడ్ నిర్ధారణ అయింది. సోమవారం సేకరించిన 194 నమూనాలను పరీక్షించగా ఈ ఫలితం వెల్లడైంది.

డెల్టాలకు 3,500 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు మంగళవారం 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 800, మధ్య డెల్టాకు 200, పశ్చిమ డెల్టాకు 2,500 క్యూసెక్కులు విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.45 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఇంటర్ ఫలితాలు

రాయవరం: విద్యార్థుల భవిష్యత్తుకు మైలురాయిగా నిలిచే ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలు బుధవారం విడుదల కానున్నాయి. ఈ ఏడాది ప్రభుత్వం రికార్డు స్థాయిలో కేవలం 22 రోజుల్లోనే ఫలితాలను విడుదల చేస్తుండడం గమనార్హం. తొలుత మే మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించినా, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంకా ముందుగానే ఫలితాలు వెల్లడిస్తున్నారు. తద్వారా ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యం తెలుస్తోంది. గత నెల 15 నుంచి ఇంటర్ ప్రథమ, 16 నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. కోనసీమ జిల్లాలో 12 ప్రభుత్వ, రెండు ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు, 98 ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. మొత్తం 28,973 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాల్లో ఫస్టియర్ జనరల్ 11,114, ఒకేషనల్ 2,624 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, సెకండియర్ జనరల్ విభాగం నుంచి 12,876 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,359 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలను బుధవారం సాయంత్రం 5 గంటలకు విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విడుదల చేయనున్నట్లు జిల్లా అధికారులకు సమాచారం అందింది.

నేటితో ముగియనున్న 'పది' మూల్యాంకనం



పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేస్తున్న ఉపాధ్యాయులు

రాయవరం: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం 90 శాతం పూర్తయింది. ఈ ప్రక్రియ 19న అమలాపురం బాలుర ఉన్నత పాఠశాలలో ప్రారంభం కాగా బుధవారంతో పూర్తి కానుంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన మొత్తం 1,84,083 పేపర్లను మూల్యాంకనం చేస్తున్నారు. తెలుగు 25,168, కాంపోజిట్ తెలుగు 3,457, సంస్కృతం 2,163, హిందీ 29,058, ఇంగ్లిష్ 24,209, గణితం 24,017, పీఎస్ 24,781, బయాలజీ 24,781, సోషల్ 26,307, ఒకేషనల్ 142 పేపర్లను మూల్యాంకనం నిమిత్తం జిల్లాకు కేటాయించారు. ఈ ప్రక్రియ ప్రారంభమైన ఈ నెల 19న 9,569, 20న 22,968, 21న 21,816, 22న 24,299, 23న 26,140, 24న 27,767, మంగళవారం 30,027 పేపర్లను మూల్యాంకనం చేశారు. బుధవారం 21,767 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంది. షెడ్యూల్ ప్రకారం మూల్యాంకనం జరుగుతుందని, వచ్చే నెల రెండో వారంలో పదో తరగతి ఫలితాలను ప్రకటించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డీజీ దేవానందరెడ్డి ప్రకటించారు. అందరి సహకారంతో మూల్యాంకనం ప్రక్రియ విజయవంతంగా నిర్వహించామని అమలాపురం డీఈఓ ఎం.కమలకుమారి తెలిపారు.

నేడు వాడపల్లి వెంకన్న హుండీల లెక్కింపు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను బుధవారం ఉదయం 9 గంటల నుంచి లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. ఈ లెక్కింపులో దేవదాయ ధర్మదాయ శాఖ ఉన్నతాధికారులతో పాటు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, కమిటీ సభ్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొంటారన్నారు.

గిఫ్ట్ వచ్చిందంటూ టోకరా

అమలాపురం టౌన్: ఆన్‌లైన్ మోసంపై ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో మంగళవారం అమలాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఎన్.సంజీవరాణికి ఈ నెల 5న ఓ ఫోన్ కాల్ వచ్చింది. మీకు గిఫ్ట్ వచ్చిందని, రూ.5 వేల షాపింగ్ చేస్తే ఆ గిఫ్ట్ వస్తుందని చెప్పి సదరు వ్యక్తి నమ్మబలికాడు. దీంతో ఆమె షాపింగ్ చేసింది. తర్వాత రూ.9,999 తన ఫోన్ నంబర్‌కు గూగుల్ పే చేయమన్నాడు. అలా చేస్తే గిఫ్ట్‌తో పాటు కట్టిన సొమ్ము తిరిగి జమ అయిపోతాయన్నాడు. తర్వాత దఫాదఫాలుగా అకౌంట్ నుంచి మరో రూ.35 వేలకు పైగా ఆమెకు తెలియకుండానే డ్రా చేసేశాడు. ఇలా మొత్తం రూ.51,863 కాజేశాడు. ఇదేంటని అతనికి ఫోన్ చేసి అడిగితే రెండు రోజుల్లో మీ ఫోన్‌కు మొత్తం డబ్బులు పడతాయని నమ్మబలికాడు. అరులియా సంస్థ నుంచి మాట్లాడుతున్నానని చెప్పిన ఆ వ్యక్తి ఫోన్ రెండు రోజుల తర్వాత స్విచ్ ఆఫ్ అని రావడంతో మోసపోయినట్లు బాధితురాలు గ్రహించి అమలాపురం పట్టణ పోలీసులను ఆశ్రయించింది. దీనిపై పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాస్ కేసు నమోదు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంట పండింది

- అంచనాలకు మించి ధాన్యం దిగుబడులు
- ఎకరాకు 50 బస్తాలు పైనే..
- అన్నదాతల ఆనందహేల
- ముమ్మరంగా కొనుగోళ్లు
- మూడు వారాల్లో 44,420.4 మెట్రిక్ టన్నుల సేకరణ



కాకినాడ జిల్లా గండేపల్లిలో రైతు వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అంచనాలకు మించిన దిగుబడులు.. కనీస మద్దతు ధరకే (ఎంఎస్‌పీ) బొండాల రకం ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్.. రైతుభరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) ఏకకాలంలో పెద్ద సంఖ్యలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం.. కొనుగోళ్లకు అన్నివిధాలా సహకారం.. ఇలా అన్నివిధాలా రబీ రైతు ఇంట ఆనందాల పంట పండుతోంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం రబీ వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ తరుణంలో ఏ రైతును కదిపినా దిగుబడులు బాగున్నాయనే చెబుతున్నారు. రెండు రోజుల క్రితం హఠాత్తుగా వచ్చి పడ్డ వర్షాలతో కాస్త కలత చెందినా.. పెద్దగా నష్టం లేకుండానే గట్టెక్కారని చెప్పవచ్చు. ఎకరాకు రూ.45 వేల వరకూ పెట్టుబడి అయ్యింది. వాతావరణం అనుకూలించి, తెగుళ్ల బెడద తక్కువగా ఉండటం, సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలతో అంచనాలకు మించి పంట పండింది. ఎకరాకు సగటున 50 నుంచి 60 బస్తాలు(75 కేజీలు) దిగుబడి వస్తోందని వ్యవసాయాధికారులు అంచనా. దీంతో రైతుల ఆనందానికి అవధి లేకుండా ఉంది. తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 50 శాతం పైనే వరి కోతలు పూర్తి కాగా ధాన్యం కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి.

3 జిల్లాల్లో ఇదీ పరిస్థితి

- తూర్పు గోదావరి జిల్లాలో అన్ని రకాలూ కలిపి 23,840 హెక్టార్లలో (45 శాతం) వరి కోతలు పూర్తయ్యాయి. మొత్తం 55,095 హెక్టార్లలో వరి సాగు చేయగా, ఇందులో 43 వేల హెక్టార్లలో ఎంటీయూ–1121 రకమే సాగు చేశారు. ఈ రకం ఎకరాకు 48 నుంచి 55 బస్తాల (75 కేజీలు) దిగుబడి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోతలు పూర్తయినంత వరకూ చూస్తే ఈ రకం 1,51,804 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. కేవలం పది రోజుల వ్యవధిలోనే ఈ జిల్లాలో రూ.59.83 కోట్ల విలువైన 30,074 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.
- మండపేట, రామచంద్రపురం, అనపర్తి నియోజవర్గాల్లో ఎక్కువగా 8,500 హెక్టార్లలో ఎంటీయూ–3626 (బొండాలు) రకం సాగు చేశారు. ఈ రకం పంట కోతలు జరుగుతున్నాయి. ఇంతవరకూ అందిన సమాచారం ప్రకారం 25,004 మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చింది.
- అందరికంటే ముందుగా ఈ నెల 4న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన కోనసీమ జిల్లాలో రూ.2.40 కోట్ల విలువైన 13,428.520 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.
- కాకినాడ జిల్లాలో 1.65 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు చేశారు. అత్యధికంగా 90 వేల ఎకరాల్లో బొండాల రకం సాగు జరిగింది. ఎకరాకు 55 నుంచి 60 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. ఇప్పటి వరకూ సుమారు 40 వేల ఎకరాల్లో కోతలు పూర్తి కాగా సరాసరి 60 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చిందని జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ అంచనా వేశారు. జిల్లాలో వరి కోతలు కాస్త ఆలస్యమైనా కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే ఊపందుకుంటున్నాయి.
- మద్దతు ధర బస్తాకు రూ.1,530 కాగా ఎకరాకు 50 బస్తాలకు రూ.76,500 వస్తుంది. పెట్టుబడులు పోనూ రైతుకు రూ.31,500 నుంచి రూ.32,500 వరకూ మిగులుతుంది. కౌలు రైతు ఒక పంటకు 13 బస్తాల వరకూ శిస్తు చెల్లించాలి. ఈ మేరకు పెట్టుబడి, 13 బస్తాల శిస్తు కలిపి రూ.19,890 పోగా రూ.11 వేల నుంచి రూ.12 వేలు మిగులుతూండటంతో కౌలు రైతులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేయాలి

రాజానగరం: రబీలో రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేసేలా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. మండలంలోని నామవరం ఆర్‌బీకేను మంగళవారం సందర్శించిన ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలుపై అధికారులకు సూచనలు చేశారు. రైతులు కళ్లంలో ధాన్యం రాశులు పోసి ఉంచకుండా, ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేలా షెడ్యూలింగ్ చేశామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ కోతలు ప్రారంభమయ్యాయని, అన్ని కొనుగోలు కేంద్రాలనూ సిద్ధం చేశామని తెలిపారు. ఆయా కేంద్రాల్లో తగిన సిబ్బందితో పాటు తేమ శాతం తెలుసుకునే పరికరాలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచామన్నారు. రబీలో తేమ 17 శాతం మించి ఉండే అవకాశం లేదన్నారు. నూకలు ఉన్నాయని, విరిగిపోయాయని అంటూ ఎటువంటి అభ్యంతరాలూ చెప్పరాదని మిల్లర్లకు స్పష్టం చేశామని తెలిపారు. ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా ప్రతి రోజూ జాయింట్ కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్ర స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు. గన్నీ బ్యాగ్‌లు, రవాణాపై ముందస్తు కార్యాచరణ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, ఆర్‌డీఓ ఎ.చైత్రవర్షిణి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు సభ్యుడు కంటే తేజ్ తదితరులు ఉన్నారు.

కలెక్టర్ల స్వీయ పర్యవేక్షణలో..

ఆర్‌బీకేలలో మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తూండటంతో రైతులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారు. మూడు జిల్లాల్లోనూ గతానికి భిన్నంగా ఈసారి సీజన్ ప్రారంభంలోనే ఏకకాలంలో పెద్ద ఎత్తున కొనుగోలు కేంద్రాలు తెరిచారు. ప్రతి గింజా కొనుగోలు చేయాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి అనుగుణంగా ఈ నెల 4, 16, 19 తేదీల్లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలతో వరి కోతలు, మాసూళ్లు కాస్త మందగించినా.. ఉష్ణోగ్రతలు పెరగడంతో తిరిగి ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్‌బీకేలను ఆయా జిల్లాల కలెక్టర్లు స్వయంగా పరిశీలిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లను జాయింట్ కలెక్టర్లు పర్యవేక్షిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత రాజానగరం నియోజకవర్గం నామవరం ఆర్‌బీకేను సందర్శించారు. తడిసి పనలపై ఉన్న ధాన్యాన్ని కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి, కొనుగోలుకు ఆదేశాలు ఇచ్చారు. తడిసిన పనలను తీయడంతో పాటు మాసూళ్లను ఉపాధి హామీ పథకం కూలీలతో చేయించేందుకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఇలా..

ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు :	837
కొనుగోలు చేసిన ధాన్యం :	44,420.4 మెట్రిక్ టన్నులు
ఆర్‌బీకేలకు విక్రయించిన రైతులు:	5,203
కొనుగోలు చేసిన ధాన్యం విలువ:	రూ.89.13 కోట్లు

తూర్పు గోదావరి జిల్లాలో..

ప్రారంభించిన ఆర్‌బీకేలు :	233
కొనుగోలు చేసిన ధాన్యం :	30,074 మెట్రిక్ టన్నులు
ఆర్‌బీకేలకు విక్రయించిన రైతులు :	3,369
కొనుగోలు చేసిన ధాన్యం విలువ :	రూ.59.83 కోట్లు

కాకినాడ జిల్లాలో..

ప్రారంభించిన ఆర్‌బీకేలు :	215
కొనుగోలు చేసిన ధాన్యం :	917.880 మెట్రిక్ టన్నులు
ఆర్‌బీకేలకు విక్రయించిన రైతులు :	127
కొనుగోలు చేసిన ధాన్యం విలువ :	రూ.1.99 కోట్లు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో..

ప్రారంభించిన ఆర్‌బీకేలు :	389
కొనుగోలు చేసిన ధాన్యం :	13,428.520 టన్నులు
ఆర్‌బీకేలకు విక్రయించిన రైతులు :	1,707
కొనుగోలు చేసిన ధాన్యం విలువ :	రూ.27.40 కోట్లు

ఆర్‌బీకేలతో కనీస మద్దతు ధర



సొంతంగా, కౌలుకు సుమారు 20 ఎకరాల్లో రబీ సాగు చేశాను. మంచి దిగుబడి వచ్చింది. అయితే వర్షాలకు ధాన్యం తడవడం వల్ల కొంత నష్టం వాటిల్లింది. మా గ్రామంలోని ఆర్‌బీకే ద్వారా ఇప్పటి వరకూ 367 బస్తాలు అమ్మాను. దీని వల్ల కనీస మద్దతు ధర వస్తోంది.

– పెద్దిరెడ్డి మునీంద్రరావు, గాడిలంక, ముమ్మిడివరం మండలం

ముందంజలో మనమే..

- 'జగనన్నే మా భవిష్యత్తు'కు స్పందన
- రాష్ట్రంలో అమలాపురానికి రెండో స్థానం
- సీఎం జగన్‌పై నమ్మకానికి ఇదే నిదర్శనం
- మంత్రి పినిపే విశ్వరూప్ వెల్లడి



మున్సిపల్ కౌన్సిలర్ లక్ష్మిని అభినందిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ తదితరులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహణలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని విశ్లేషించినందుకు రాష్ట్రంలో అమలాపురం నియోజకవర్గం ద్వితీయ స్థానం సాధించిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. మంగళవారం అమలాపురం సర్ ఆర్థర్ కాటన్ అతిథి గృహంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌తో కలసి మంత్రి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లినప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసి 77 వేల మంది తమ ఫోన్ ద్వారా మిస్డ్ కాల్స్ చేశారన్నారు. సీఎం జగన్ పాలనపై ప్రజల నమ్మకానికి, విశ్వాసానికి ఇదే నిదర్శమని అన్నారు. నియోజకవర్గంలోని అమలాపురం, 60 గ్రామాల్లో పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు, నాయకులు, 248 మంది సచివాలయ కన్వీనర్లు, 2,073 మంది గృహ సారథులు ప్రతి గృహానికి వెళ్లి జగనన్న సంక్షేమ పాలన గురించి వివరించారన్నారు. దీనికి ప్రజలు స్వచ్ఛందంగా మద్దతు తెలిపినందుకే ద్వితీయ స్థానం లభించిందని మంత్రి విశ్వరూప్ అన్నారు. ఈ విజయం, శ్రమ అంతా పార్టీ శ్రేణులదేనన్నారు. వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమలాపురం 15వ వార్డు కౌన్సిలర్ వాసర్ల లక్ష్మి ప్రజలతో 270 మిస్డ్ కాల్స్ ఇప్పించి నియోజకవర్గంలో ముందంజలో ఉన్నారని వెల్లడించారు. అనంతరం లక్ష్మిని సత్కరించారు. రాష్ట్రంలో కోటి ఇళ్లను వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సందర్శించి జగనన్నే మా భవిష్యత్ గురించి వివరిస్తే సుమారు 70 లక్షల మంది మిస్డ్ కాల్స్ ఇచ్చి సీఎంకు మద్దతుగా తెలిపారని గుర్తు చేశారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు డ్వాక్రా మహిళలకు పసుపు–కుంకుమ పేరుతో మసిపూసి మారేడు కాయ చేస్తే అదే ప్రస్తుత సీఎం జగన్ డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో మాఫీ చేసి రూ.25 వేల కోట్ల నిధులు వెచ్చించారని స్పష్టం చేశారు. ఇప్పటికే డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో వారి రుణాలను రూ.19 వేల కోట్ల మేర మాఫీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సీఎం జగన్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో ప్రజల్లో నమ్మకం పెరిగిందని విశ్వరూప్ అన్నారు. అందుకే జగనన్నే మా భవిష్యత్ పేరుతో ఇంటింటా నిర్వహించిన మెగా సర్వే ప్రజాభిప్రాయ సేకరణలో ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. ఎమ్మెల్సీలు సూర్యనారాయణరావు, ఇజ్రాయిల్ మాట్లాడుతూ రాష్ట్రంలో అమలాపురం రెండో స్థానం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి విశ్వరూప్‌ను అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, అమలాపురం పట్టణ, ఉప్పలగుప్తం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సంసాని బులినాని, బద్రి బాబ్జీ, జెడ్పీటీసీలు పందిరి శ్రీహరి రామగోపాల్, గెద్దం సంపదరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన 'రిజిస్ట్రేషన్' యూజర్ చార్జీలు

అమలాపురం టౌన్: రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసినప్పుడు వసూలు చేసే యూజర్ చార్జీలను పెంచుతూ రాష్ట్ర రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇక నుంచి పెరిగిన చార్జీలు అమలు అవుతున్నాయి. రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పలు సేవలపై గతంలో రూ.10 నుంచి రూ.100 వరకూ ఉండే యూజర్ చార్జీలు తాజా జీవో ప్రకారం రూ.50 నుంచి రూ.500 వరకూ పెంచారు. మొత్తం పది రకాల సేవలపై ఈ చార్జీలు అమలు కానున్నాయి. ఉదాహరణకు రూ.5 వేల విలువ లోపు స్టాంపుల కొనుగోలుపై ఇప్పటి వరకూ ఉన్న రూ.10 యూజర్ చార్జీ రూ.50కి పెరిగింది. అలాగే వీలునామా, రద్దు దస్తావేజులు, సొసైటీ, బ్యాంక్, ప్రైవేట్ తనఖా చెల్లు రశీదులకు గతంలో రూ.100 ఉంటే ఇప్పుడు రూ.500కి పెంచారు. ఈ రశీదుల కింద వినియోగదారులు రూ.వెయ్యి చెల్లించాల్సి ఉంటే రూ.100 యూజర్ చార్జీతో కలిపి మొత్తం రూ.1,100 చెల్లించేవారు. ఇప్పుడు అసలు రూ.వెయ్యికి యూజర్ చార్జీ కింద రూ.500 అంటే మొత్తం రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. మంగళవారం నుంచే పెరిగిన చార్జీలను అమలులోకి తెచ్చామని అమలాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రిజిస్ట్రార్ ఎం.రత్నకుమార్ తెలిపారు.

ఉపాధి కూలీలతో వ్యవసాయం



వరి చేలో పనలు పోగు పెడుతున్న ఉపాధి హామీ పథకం కూలీలు

- తడిసిన పనల ఒబ్బిడి
- కష్టకాలంలో రైతులకు అండ

సాక్షి అమలాపురం: అకాల వర్షాలతో పనలపై పంట నష్టపోయిన రైతులకు ఉపాధి కూలీలు అక్కరకు వచ్చారు. రైతు కష్టకాలంలో ఉన్న సమయంలో జిల్లా యంత్రాంగం స్పందించి వారికి జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) ద్వారా చేయూత అందించింది. వ్యవసాయానికి ఉపాధి హామీ పథకం దగ్గర చేసే చర్యలలో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు జిల్లాలోని పలు మండలాల్లో నీట మునిగిన వరి పనలను ఉపాధి కూలీలతో గట్ల మీదకు చేర్పుతున్నారు. ముమ్మిడివరం, రాజోలు, అల్లవరం మండలాల్లోని పంట పొలాల్లో పనలను ఒడ్డుకు చేర్చడం, పనలు తిప్పి ఆరబెట్టే పనుల్లో ఉపాధి కూలీలు పాల్గొన్నారు. రాజోలు మండల పరిధి రాజోలు, చెన్నడం, శివకోడు, చింతలపల్లి, కూనవరం, ముల్కిపల్లి, మెరకపాలెం, పొన్నమండ, బి.సావరం, సోంపల్లి గ్రామాల్లోనూ, ముమ్మిడివరం మండలం చినకొత్తలంక, కొత్తలంక, గాడిలంక, అన్నంపల్లి గ్రామాల్లోనూ ఉపాధి కూలీలు పనులు చేస్తున్నారు. పనలు తిరగేసి ఆరబెట్టడంతో పాటు ఉప్పు ద్రావణం పిచికారీ చేసే పనులు, ఆరిన ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించే పనులు నిర్వహించారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రాబోయే మూడు రోజుల వరకూ పంట కోతలు చేపట్టవద్దని వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటించారు. వరి పంట నష్ట నివారణ చర్యల్లో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ శుక్లా ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలకు పనలు తడిసి అన్నదాత దిక్కు తోచని స్థితిలో ఉన్న సమయంలో వారికి కూలీల కొరత తీర్చడంతో పాటు కొంత వరకు పెట్టుబడి కలసి వచ్చేలా జిల్లా యంత్రాంగం తీసుకున్న నిర్ణయంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చదువరులకు చల్లని దీవెన

- పేద విద్యార్థులకు అండగా ప్రభుత్వం
- నేడు జగనన్న వసతి దీవెన సొమ్ము విడుదల
- జిల్లాలో 33,344 మందికి రూ.31.74 కోట్లు



సాక్షి, అమలాపురం: పేదల ఉన్నత విద్యకు ప్రభుత్వ చల్లని 'దీవెన' అందుతోంది.. అందరికీ విద్య నినాదంతో భరోసా కల్పిస్తోంది.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న వసతి దీవెన ద్వారా విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందిస్తోంది. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఏడాదికి రెండు దఫాలుగా వసతి దీవెన సొమ్మును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. ఈ ఏడాది తొలి విడతగా జిల్లాలోని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో వసతి దీవెన సొమ్ము పడనుంది.

పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక... వంటి పథకాలకు కొనసాగింపుగా 'జగనన్న వసతి దీవెన'ను సైతం అమలు చేస్తోంది. ఈ పథకంలో లబ్ధిదారులైన విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాలో బుధవారం సొమ్ము పడనుంది. అనంతపురం జిల్లా నార్పలలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విద్యార్థులకు నగదు జమ చేయనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, మైనారిటీ, క్రిస్టియన్ విద్యార్థులు ఈ పథకంలో లబ్ధి పొందనున్నారు. దీని ద్వారా ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు రూ.పది వేలు, డిప్లమో విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి రూ.20 వేల చొప్పున అందజేయనున్నారు. తొలి విడతగా సగం సొమ్ము తల్లుల ఖాతాల్లో పడనున్నాయి.

ఎంత మందికి లబ్ధి అంటే..

జగన్న వసతి దీవెన కింద జిల్లాలో 33,344 మంది విద్యార్థులకు రూ.31.74 కోట్ల మేర లబ్ధి జరుగనుంది. విద్యార్థులకు చెందిన 29,871 మంది తల్లుల ఖాతాల్లో ఈ సొమ్ము జమ అవుతోంది. ఈ పథకంలో బీసీ, ఎస్సీ, కాపు సామాజిక వర్గాలకు చెందిన వారు అత్యధికంగా లబ్ధి పొందనున్నారు. ఈ సొమ్మును విద్యార్థులు కాస్మెటిక్స్ చార్జీలు, పుస్తకాలు కొనుగోలు, చదువుకు అవసరమైన ఇతర అవసరాలకు వినియోగించనున్నారు.

జిల్లాలో సామాజికవర్గాల వారీగా లబ్ధి ఇలా..

సామాజిక వర్గం	విద్యార్థులు	విద్యార్థుల తల్లులు	లబ్ధి (రూ..)
ఎస్సీ	8,399	7,625	7,90,97,500
ఎస్టీ	161	142	15,17,500
బీసీ	13,421	11,984	12,70,37,500
ఈబీసీ	3,554	2,345	2,50,37,500
ముస్లిం, మైనార్టీలు	291	257	28,35,000
కాపులు	8,382	7,464	8,05,67,500
క్రిస్టియన్	136	123	13,42,500
మొత్తం	33,344	29,871	31,74,35,000

అర్హులందరికీ లబ్ధి

జగనన్న వసతి దీవెనలో తొలి విడత సొమ్ము విద్యార్థుల తల్లుల ఖాతాలో పడనున్నాయి. అర్హులైన ప్రతి పేద విద్యార్థికీ ఈ పథకంలో లబ్ధి చేకూరనుంది. ఈ సొమ్మును విద్యార్థులు కాస్మెటిక్స్, బుక్స్ వంటి వాటికి వినియోగించుకోవచ్చు. ఇందులో లబ్ధిదారులందరికీ న్యాయం జరుగుతోంది.

– పి.జ్యోతిలక్ష్మీ దేవి, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి

క్లుప్తంగా


అండర్-23 జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపిక

అంబాజీపేట: ఉమ్మడి గోదావరి జిల్లాల అండర్- 23 క్రికెట్ జట్టుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికైనట్లు అంబాజీపేట సబ్ సెంటర్ కోచ్ వెంకటనగేష్ మంగళవారం తెలిపారు. ఎంపికైన వారిలో బి.సుజన్, యు.సందేష్, వంశీనారాయన్, శింగం శ్రీనివాస్‌లు ఉన్నారన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకు విశాఖపట్నంలో జరిగే నార్త్ జోన్ జట్లతో జిల్లా జట్టు తలపడనుందని వెంకటనగేష్ చెప్పారు. జిల్లా క్రికెట్ కోచ్‌గా మట్టా సత్తిబాబు వ్యవహరిస్తారన్నారు. ఎంపికైన క్రీడాకారులను సబ్ సెంటర్ సభ్యులు అభినందించారు.

రూ.1,500 చెల్లించి కల్యాణంలో పాల్గొనండి

అన్నవరం: రత్నగిరిపై మే 1న జరిగే సత్యదేవుని దివ్య కల్యాణ మహోత్సవంలో పరోక్షంగా పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు అన్నవరం దేవస్థానం ఈఓ ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. భక్తులు ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రూ.1,500 చెల్లిస్తే వారి గోత్రనామాలతో స్వామివారి వార్షిక కల్యాణం నిర్వహించి, వారి చిరునామాకు పసుపు, కుంకుమ, కల్యాణ తలంబ్రాలు, స్వామివారి ప్రసాదం, కండువా, రవికల వస్త్రం పోస్టు ద్వారా పంపిస్తారని వివరించారు. దేవస్థానం యూట్యూబ్ చానల్ ద్వారా స్వామివారి వార్షిక కల్యాణోత్సవం తిలకించవచ్చని అన్నారు.

శతాధిక వృద్ధుల మృతి


సత్యనారాయణ రాజు (ఫైల్)

ఉప్పలగుప్తం: ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధి రాజుపాలేనికి చెందిన శతాధిక వృద్ధుడు పాత్తూరి సత్యనారాయణ రాజు (104) మంగళవారం మృతి చెందాడు. ఆయనకు భార్య వెంకాయమ్మ, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు చేసేవారని ప్రజలు తెలిపారు. గొల్లవిల్లిలో సీఎస్ఎమ్ ఇంటర్, ఎమ్ఎస్ఎస్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఆయన సహకరించారు.


రత్నకుమారి (ఫైల్)

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలేనికి చెందిన శతాధిక వృద్ధురాలు కొర్లపాటి రత్నకుమారి (100) మంగళవారం మృతి చెందారు. రత్నకుమారికి ఒక కుమారుడు, ఐదుగురు కుమార్తెలు, మనుమలు, మనుమరాళ్లు, ముని మునుమలు కలిపి మొత్తం 82 మంది ఉన్నారు. ఆమె మృతికి బంధువులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

కలెక్షన్ ఫుల్



- ముని్సపాలిటీల్లో పన్నుల రాయితీకి స్పందన
- 24 రోజుల్లో రూ.28.63 కోట్ల వసూలు
- 30వ తేదీతో ముగియనున్న గడువు

కొవ్వూరు: ఐదు శాతం పన్ను రాయితీ అందిపుచ్చుకున్నారు.. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని పన్నుదారులు సద్వినియోగం చేసుకుంటున్నారు.. మున్సిపాలిటీల్లో ఈ రాయితీకి విశేష స్పందన లభిస్తోంది. గడచిన ఇరవై నాలుగు రోజుల్లో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ఏకంగా రూ.28.63 కోట్ల పన్నులు వసూలయ్యాయి. గత ఏడాదితో పోల్చితే రూ.4.79 కోట్లు అదనంగా వసూలైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. 2023-24 ఆర్థిక సంవత్సరానికి చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెల 30వ తేదీలోపు చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం పన్ను రాయితీని ప్రకటించిన విషయం తెలిసిందే. కేవలం ఈ రాయితీ పొందడానికి మరో ఐదు రోజులే గడువే ఉంది. దీనిపై పురపాలక సంఘాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఈ ఏడాదిలో చెల్లించాల్సిన పన్ను అంతా ఏకమొత్తంలో కడితే ఐదు శాతం రాయితీ లభిస్తుంది. మిగిలిన రోజుల్లో మరో రూ.నాలుగైదు కోట్లు వసూలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఏ జిల్లాలో ఎంతెంత..

ప్రస్తుతం సాధారణ రోజుల్లో కంటే పన్నుల వసూళ్లు నాలుగైదు రెట్లు అదనంగా ఉంది. గత ఏడాది మే 24 నాటికి తూర్పుగోదావరి జిల్లాలో రూ.1,017.73 లక్షలు వసూలైతే ప్రస్తుతం రూ.1,307.76 లక్షలు వచ్చింది. అంటే రోజుకు గత సంవత్సరం రూ.42.40 లక్షలు సరాసరి కాగా ఇప్పుడు రూ.54.49 లక్షల చొప్పున పన్నులు చెల్లించారు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో గరిష్టంగా రోజుకు సరాసరిన రూ.48 లక్షల నుంచి రూ.50 లక్షల చొప్పున పన్నులు వసూలవుతున్నాయి. కొవ్వూరులో రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల చొప్పున, నిడదవోలులో రూ.3 లక్షల చొప్పున వస్తుంది.

- కాకినాడ జిల్లాలో గత ఏడాది రూ.1,080.37 లక్షలు వసూలైతే ఈ సంవత్సరం రూ.1,323.21 లక్షలు వసూలు చేశారు. అంటే గడచిన ఏడాది కంటే ఇప్పుడు రూ.242.84 లక్షలు అదనంగా వసూలైంది. రోజుకు పన్ను వసూలు సరాసరి రూ.45 లక్షల నుంచి రూ.55.13 లక్షలకు పెరిగింది.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం ఐదు శాతం పన్ను రాయితీ అంత ఆశాజనకంగా లేదు. గత ఏడాదితో పోల్చితే ఈ సారి రూ.53.9 లక్షలు తక్కువ వసూలైంది. జిల్లా వ్యాప్తంగా గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.286.13 లక్షలు వసూలైతే ఈ ఏడాది 24వ తేదీకి రూ.232.23 లక్షలు వచ్చింది. జిల్లాలో రోజువారీ సరాసరి పన్నుల వసూలు గత ఏడాది రూ.11.92 లక్షలుంటే, ఇప్పుడు రూ.9.67 లక్షలు ఉంది.


రాజమహేంద్రవరం నగరం

స్పందన బాగుంది



మున్సిపాలిటీల్లో ఈ నెలాఖరు లోపు పన్నులు పూర్తిగా చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ ఇస్తున్నాం. దీనికి ప్రజల నుంచి స్పందన బాగుంది. గత ఏడాది కంటే ఈ ఆర్థిక సంవత్సరం పన్ను రాయితీని ఎక్కువ మంది సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల్లో రూ.28.63 కోట్ల మేర పన్నులు వసూలయ్యాయి. పన్ను రాయితీకి ఇంకా ఐదు రోజులు మాత్రమే గడువు ఉంది. ఈ రోజుల్లో రూ.30 కోట్లపైనే పన్నులు వసూలయ్యే అవకాశం ఉంది.

– ఎస్‌వీవీ సత్యనారాయణ, రీజినల్ డైరెక్టర్, మున్సిపల్ శాఖ, రాజమహేంద్రవరం

జిల్లా	గత ఏడాది పన్నుల వసూలు (లక్షల్లో..)	ప్రస్తుతం (లక్షల్లో..)	వ్యత్యాసం (లక్షల్లో..)
తూర్పుగోదావరి	రూ.1017.73	రూ.1307.76	రూ.289.83
కాకినాడ	రూ.1080.37	రూ.1323.21	రూ.242.84
కోనసీమ	రూ.286.13	రూ.232.23	రూ.53.9

ఉన్నత ప్రమాణాలు అలవర్చుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి రవికుమార్

రాజానగరం: అటవీ శాఖ ఉద్యోగులు విధుల నిర్వహణలో ఉన్నత ప్రమాణాలు అలవర్చుకోవాలని సమాచార శాఖ మాజీ కమిషనర్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎం.రవికుమార్ సూచించారు. రాష్ట్రంలో కొత్తగా ఫారెస్ట్ రేంజ్ అధికారులుగా ఉద్యోగాలు పొందిన వారికి దివాన్‌చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో ఓరియంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ మంగళవారంతో ముగిసింది. వారికి సర్టిఫికెట్ల ప్రదానం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో సమర్థత ఎంతో అవసరమని, ప్రతి విషయానికి ఆందోళన చెందడం సరికాదన్నారు. ప్రతి పరాజయం, ప్రతికూల పరిణామం కూడా భవిష్యత్తులో విజయానికి ఒక మెట్టుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకాడమీ డైరెక్టర్ పీఏపీ ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, మీడియా కూడా తమ పనిని నిశితంగా పరిశీలిస్తూ ఉంటారన్న స్పృహను అధికారులు కలిగి ఉండాలన్నారు. అధికారులు సానుకూల దృక్పథంతో విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అకాడమీ ఏసీఎఫ్ డాక్టర్ ఎస్‌వీ శివరామ్‌ప్రసాద్, కోర్సు డైరెక్టర్ వి.శ్రీహరిగోపాల్, ఏసీఎఫ్‌లు టి.చక్రపాణి, టి.శ్రీనివాసరావు, ఏవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి నాటిక పోటీలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తి శ్రీమార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 16వ ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ఈ నెల 30 నుంచి జరుగనున్నాయి. వీటిని తాటిపర్తిలోని అపర్ణా కళా తోరణం శ్రీబత్తుల మురళీకృష్ణ కళా వేదికపై నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వచ్చే నెల 2వ తేదీ వరకూ పోటీలు ఉంటాయని శ్రీమార్కండేయ నాటక కళా పరిషత్ అధ్యక్షుడు పడాల రవి తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నాటక రంగంలో గుర్తింపు పొందిన కళాకారులు పాల్గొంటారన్నారు. కొత్త పరిమళం, రైతే రాజు, చీకటి పువ్వు, నాన్న నేనొచ్చేస్తా, వెండి అంచులు, గమ్యస్థానాల వైపు, కాపలా తదితర నాటికలు ప్రదర్శిస్తారన్నారు. కళాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఏడడుగులు వేయకుండానే..

- నవ జంటపై నెత్తుటి మరక
- రోడ్డు ప్రమాదంలో కాబోయే వధూవరుల మృతి
- పెళ్లిబాజా మోగకుండానే విషాదం
- శుభకార్యానికి సామగ్రి తీసుకొస్తుండగా ఘటన



రాజ్‌కుమార్, దుర్గా పావని (ఫైల్)


మృతుడు రాజ్‌కుమార్ నివాసం వద్ద విషాద ఛాయలు

కిర్లంపూడి/జగ్గంపేట: ఏడడుగులు.. మూడు ముళ్లతో ఒక్కటవ్వాల్సిన బంధం వారిది.. నిండు నూరేళ్లు కలసి జీవించాల్సిన ఆ జంట కాళ్లకు పెళ్లి పారాణి వేయక ముందే అనంత లోకాలకు వెళ్లిపోయింది.. ఒకేసారి వారిద్దరినీ మృత్యువు వెంటాడింది.. చెట్టాపట్టాలు వేసుకుని కొత్త బంగారు లోకంలో విహరిస్తూండగా లారీ రూపంలో వెనుక నుంచి మృత్యువు వెంటాడింది. పెళ్లితో ఒక్కటి కావాల్సిన వారు మృత్యువులోనూ ఒక్కటై వెళ్లిపోయారు. రాజమహేంద్రవరం సమీపాన కొంతమూరు గామన్ బ్రిడ్జి రోడ్డులోని వంతెన వద్ద జరిగిన ప్రమాదంలో ఓ జంట దుర్మరణం పాలైంది. మరో 15 రోజుల్లో పెళ్లి చేసుకుని నూరేళ్ల జీవించాల్సిన కాబోయే వధూవరులను మృత్యువు వేటాడింది. జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన మానేపల్లి రాజ్‌కుమార్ (24), కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన దుర్గా పావని (18)లకు పెళ్లి నిశ్చయమైంది. ఈ పెళ్లి పనుల్లో భాగంగా 4న పసుపు దంచే ప్రక్రియ పూర్తి చేశారు. వచ్చే నెల 10న పెళ్లి చేసేందుకు పెద్దలు ముహూర్తం నిర్ణయించారు. ఈ పెళ్లి పనుల్లో ఇరు కుటుంబాలూ నిమగ్నమయ్యాయి. ఇరు ఇళ్లలోనూ బంధువుల సందడి నెలకొంది.

మా పెళ్లికి రారండి అంటూ..

కాబోయే భార్యాభర్తలు రాజ్‌కుమార్, దుర్గాపావని ఇప్పటికే తమ పెళ్లి రావాలంటూ బంధువులు, స్నేహితులను ఆహ్వానించారు.. మా పెళ్లికి రండి.. మమ్మల్ని ఆశీర్వదించడంటూ నవ్వుతూ పిలిచారు. ఇదిలా ఉండగా వారిద్దరూ మంగళవారం వీరవరంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. అనంతరం వారి పెళ్లికి సంబంధించిన సామగ్రి తీసుకోవడానికి రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తున్నారు. కొంతమూరు గామన్ బ్రిడ్జి రోడ్డులోని వంతెన వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ వారి బైక్‌ను ఢీకొంది. వారిద్దరూ అక్కడికక్కడే మరణించారు. శుభకార్యం జరగాల్సిన ఇళ్లలో ఈ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కుప్పకూలిపోయాయి. ఆ వార్త నిజం కాకుండా ఉంటే బాగుండునని వారిలో వారే మధనపడ్డారు.

ఒక ఇంటివాడు కావాలని..

జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామానికి చెందిన మానేపల్లి వెంకటేశ్వరరావు, లక్ష్మి దంపతులకు ముగ్గురు సంతానం. కుమార్తెకు పెళ్లి కాగా, చిన్న కుమారుడు చదువుకుంటున్నాడు. మరో కుమారుడు, మృతుడు రాజ్‌కుమార్ తాపీమేస్త్రిగా పని చేస్తూ ఆ కుటుంబానికి కొండంత భరోసా ఉన్నాడు. ఈ మధ్యే జగనన్న ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణ పని ప్రారంభించాడు. పెళ్లి కాబోతున్న నేపథ్యంలో ఓ ఇంటివాడూ కావాలనే ఆశతో ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. కలల సౌధం నిర్మించుకోవాలని ఆశ పడ్డాడు. ఇదిలా ఉంటే మే 4న పెళ్లి పనులకు సంబంధించి పసుపు కొట్టే వేడుకలకు అతని తల్లిదండ్రులు ఏర్పాట్లు చేశారు. తన కొడుకు పెళ్లి చూడకుండా ఇలా వెళ్లిపోయాడంటూ ఆ తల్లిదండ్రులు విలపిస్తున్నారు.

వేడుకగా పెళ్లి చేద్దామని..

కిర్లంపూడి మండలం సోమవరం గ్రామానికి చెందిన మలికిరెడ్డి సత్యనారాయణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె మలిరెడ్డి దుర్గాపావని (18) పదో తరగతి వరకూ చదివింది. చిన్న కుమార్తె ఇంకా విద్యనభ్యసిస్తోంది. సత్యనారాయణ స్టోన్ క్రషర్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ తన కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. తన మొదటి బిడ్డ పెళ్లి వేడుకగా చేసి అత్తారింటికి పంపుదామని అనుకున్న సమయంలో ఇలా జరగడంతో తండ్రి శోకసంద్రంలో మునిగిపోయాడు. అల్లారు ముద్దుగా పెంచుకున్న తన కుమార్తె రోడ్డు ప్రమాదంలో మరణించిందనే వార్త విని దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

చిననాటి జ్ఞాపకాలు మరువలేనివి


దానయ్యకు స్వాగతం పలుకుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ సుబ్బారావు తదితరులు

తాళ్లపూడిలో సినీ నిర్మాత దానయ్య

తాళ్లపూడి: చిననాటి మిత్రులను కలుసుకోవడం ఆనందంగా ఉందని, అలనాటి జ్ఞాపకాలు మరువలేనివని ప్రముఖ సినీ నిర్మాత డీవీవీ దానయ్య అన్నారు. తన స్వగ్రామం తాళ్లపూడికి వచ్చిన ఆయన్ని పలువురు కలుసుకున్నారు. తొలుత బల్లిపాడులో వేగేశ్వరపురం కేఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు దానయ్యను కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. దాతలు, పూర్వ విద్యార్థుల సహకారంతో అభివృద్ధి చేసిన పాఠశాలను సందర్శించాలని ఆయన్ని ఆహ్వానించారు. అనంతరం పాఠశాలకు వెళ్లిన దానయ్య తాను చదివిన పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన్ని రిటైర్డ్ ప్రొఫెసర్ కైగాల సుబ్బారావు సత్కరించారు. పాఠశాల 75 ఏళ్ల వజ్రోత్సవ వేడుకలు జూలై 9న నిర్వహిస్తున్నామని, తప్పనిసరిగా రావాలని పూర్వ విద్యార్థుల సంఘం తరఫున ఆహ్వానపత్రం ఇచ్చారు. తాళ్లపూడికి జాతర సందర్భంగా వచ్చేసినట్లు దానయ్య తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘ సభ్యులు శీర్ల సత్యనారాయణ, అప్పన రత్నాజీ, వీరమల్లు సూర్యనారాయణ, సిద్ధంశెట్టి బాలాజీ, ముక్కు శ్రీను, కిలాని గోపాల్, షరీఫ్ తదితరులున్నారు.

మురమళ్ల వీరేశ్వరస్వామికి రథం


వీరేశ్వరస్వామి ఆలయంలో రథం వద్ద ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్ దంపతులు

సమకూర్చిన ఎమ్మెల్యే సతీష్‌కుమార్

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రథం సమకూర్చడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆలయానికి రూ.12 లక్షల విలువైన టేకు రథాన్ని మంగళవారం ఆయన సతీ సమేతంగా అందజేశారు. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన రథానికి ఆలయ అర్చకస్వామి యనమండ్ర సత్యసీతారామ శర్మ, పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు, సంప్రోక్షణ చేశారు. తొలుత ఎమ్మెల్యే దంపతులకు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసు రాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ స్వాగతం పలికి పండితులచే వేద ఆశీర్వచనం అందించారు. ఏఎంసీ చైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మెర్త రాణి మిరియం జ్యోతి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ కాశే రాజు బాబు, పెమ్మాడి బాబూరావు తదితరులు ఉన్నారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉపాధి పనులు


ఉపాధి సిబ్బందికి శిక్షణ ఇస్తున్న కృష్ణమోహన్

సామర్లకోట: ఉపాధి హామీ పథకంలో సాంకేతిక నైపుణ్యంతో పనులు నిర్వహించేందుకు డ్వామా అధికారులకు శిక్షణ ఇస్తున్నట్లు పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి సంస్థ రాష్ట్ర అసిస్టెంట్ కమిషనర్ ఇ.కృష్ణమోహన్ తెలిపారు. మంగవారం స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల డ్వామా ఏపీడీలు, ఏపీఓలు, ఏసీలు, టెక్నికల్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణతో సిబ్బంది మరింత బాధ్యతగా పనులు చేస్తారని చెప్పారు. మొబైల్ యాప్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన పెంచుతున్నామని అన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఉపయోగపడే పనుల గుర్తింపు, పనులకు అంచనాలు తయారు, మొక్కలు నాటడం, పుస్తకాల నిర్వహణ, మేట్ల ఎంపిక పనితీరు, పనుల్లో లోపాలను గుర్తించడం, ఆడిటింగ్, సామాజిక తనిఖీ వంటి అంశాలపై శిక్షణ ఉంటుందని చెప్పారు. శిక్షణ కోఆర్డినేటర్ జి.శ్రీహరి ఆధ్వర్యంలో ఈటీసీ ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు, డ్వామా రిసోర్సు పర్సన్లు ఎం.సత్యనారాయణ, ఎన్.నరేష్‌బాబు, ఎస్.శ్యామల, వి.సురేష్‌కుమార్, సీహెచ్‌వీవీ నరేష్, జీటీఎన్ సాగర్‌లు మొదటి రోజు శిక్షణ ఇచ్చారు.

బాలుడి అరెస్ట్

రాయవరం: మాచవరం గ్రామంలో బాలికను గర్భవతిని చేసిన కేసులో నిందితుడైన బాలుడిని మంగళవారం రామచంద్రపురం డీఎస్పీ డి.బాలచంద్రారెడ్డి అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం సూచన మేరకు హోమ్‌కు తరలించారన్నారు. ఇదిలా ఉంటే బాలిక ఓ బిడ్డకు జన్మనిచ్చింది. బాలిక అనారోగ్యంగా ఉండడంతో ప్రస్తుతం రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకుంటున్నట్లు సమాచారం.

ఖరీదైన బైకు.. కంట పడిందో మాయం

- ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు
- 31 బైకుల స్వాధీనం


నేరస్తులను చూపుతున్న డీఎస్పీ శ్రీలత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జల్సాలకు అలవాటు పడిన ఆ యువకులు సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీలే మార్గంగా ఎంచుకున్నారు. గతంలో ఆటో మొబైల్ రంగంలో పనిచేసి ఉండటంతో, ద్విచక్ర వాహనాల చోరీలు మొదలుపెట్టారు. చివరకు పోలీసులకు పట్టుబడ్డారు. స్థానిక టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దక్షిణ మండలం డీఎస్పీ ఎం.శ్రీలత, టూటౌన్ సీఐ టి.గణేష్ ఈ వివరాలు తెలిపారు. వారి కథనం ప్రకారం.. రాజమహేంద్రవరం రూరల్ ధవళేశ్వరానికి చెందిన గుడి పవన్‌కుమార్, నగరంలో తాడితోట వీరభద్రనగర్‌కు చెందిన ఎర్రారపు సత్యనారాయణ, గుత్తాల నవీన్ కుమార్ స్నేహితులు. వీరికి గతంలో ఆటోమొబైల్ మెకానిక్‌లుగా పనిచేసిన అనుభవం ఉంది. జల్సాలకు, చెడు అలవాట్లకు బానిసలైన వీరు సులువుగా డబ్బులు సంపాదించేందుకు బైకుల చోరీలు మొదలు పెట్టారు. కురక్రారు ఎక్కువగా మక్కువ పడే ఖరీదైన స్పోర్ట్స్ బైకులను లక్ష్యంగా ఎంచుకుని చోరీలు చేసేవారు. తాళం వేసి ఉన్న బైకులను చిటికెలో దొంగిలించేవారు. పలుమార్లు పోలీసులకు చిక్కి జైలుకు వెళ్లి వచ్చినా నేరాల బాట వీడలేదు. ఇటీవల నగరంలో ద్విచక్ర వాహన చోరీలు ఎక్కువగా జరుగుతూండటంతో ఎస్పీ సీహెచ్.సుధీర్ కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు క్రైమ్ అదనపు ఎస్పీ జి.వెంకటేశ్వరరావు, డీఎస్పీ శ్రీలత పర్యవేక్షణలో సీఐ గణేష్ దర్యాప్తు చేశారు. పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టి, నిందితులు ముగ్గురినీ అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో వారి నేరాల చిట్టా బయటపడింది. ఇటీవల రాజమహేంద్రవరం, కాకినాడ, మండపేట, అనపర్తి, అమలాపురం ప్రాంతాల్లోనే కాకుండా భీమవరం, గుంటూరు నగరాల్లో కూడా వారు దొంగిలించిన 31 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.25 లక్షల వరకూ ఉంటుందని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు, వాహనాల రికవరీలో ప్రతిభ చూపిన ఎస్సైలు జీవీవీ సత్యనారాయణ, కేఎం జోషి, హెడ్ కానిస్టేబుళ్లు సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.రాజశేఖర్, కానిస్టేబుళ్లు కె.ప్రదీప్ కుమార్, వీరబాబు, బీఎస్‌కే నాయక్, ఎస్‌వీవీఎస్ఎన్ మూర్తి, కె.కామేశ్వరరావు, కరీమ్ బాషా, కె.సత్యనారాయణ, డి.శ్రీనివాస్‌లను డీఎస్పీ అభినందించారు.

వేసవి చోరీలపై జాగ్రత్త

ప్రస్తుతం వేసవి కాలం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీలత ప్రజలకు సూచించారు. పాఠశాలలకు సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి, కుటుంబ సమేతంగా బంధువుల ఇళ్లకు, విహార యాత్రలకు వెళ్తాంతుంటారని, అటువంటి సమయంలో చోరీలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇలా ఇల్లు విడిచి వెళ్లేవారు సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇస్తే గస్తీ పోలీసులు ఆయా ఇళ్లపై నిఘా పెడతారని చెప్పారు.